కథ

# మనసున్న మనిషి

డాక్టర్ మురారి భార్య కౌగిలి కోసం తపించిపోతున్నాడు. ఎప్పుడెప్పుడు ఒడిలో వాలిపోవాలాయని వేడెక్కి వున్నాడు.

తన క్లోజ్ ఫ్రెండ్ వంశీ ఆహ్వానంపై హాస్పిటల్ ప్రారంభోత్సవానికి వైజాగ్ వచ్చాడు మురారి. మిత్రుడి బలవంతంపై హాస్పిటల్‌లో మంచీ చెడూ చూస్తూ ఓ మూడురోజులు వుండాల్సి వచ్చింది. మూడురోజుల ఎడబాటే మూడు యుగాల్లా వుంది.

రేపు ప్రయాణమై వస్తున్నట్లు భార్యకు ఫోన్‌చేసి చెప్పాడు.

రాత్రంతా కంటిమీద కనుకులేదు. శరీరం కోరికతో రగిలిపోతోంది. నిద్ర పట్టక అటూ ఇటూ పొర్లుతూ విరహంతో వేగిపోయాడు.

తెల్లారగానే ఉరుకుల పరుగులమీద ప్రయాణానికి సిద్ధపడ్డాడు. బ్రష్ చేసుకుని కూనిరాగాలు తీస్తూ ఫ్రెష్‌గా స్నానం చేసి టిఫిన్ లాగించాడు. మిత్రుడికి అవసరమైన సలహాలిచ్చాడు.

రాత్రికి చూడబోయే స్వర్గాన్ని తల్చుకుంటూ గాఢ పరిష్వంగంలో తేలియాడబోయే రేయిని గూర్చి కలలుకంటూ గాలిలో తేలిపోతూ బట్టలు, మెడికల్ కిట్ సూట్‌కేసులో సర్దుకుంటుండగా ఫోన్ మ్రోగింది.

''హలో...డాక్టర్ మురారీ హియర్!''

''నేనండీ స్వర్ణని. ఎలా వున్నారు. ప్రయాణమవుతుంటారనుకుంటా. ఇప్పుడే నాన్నగారు ఊరి నుండి వచ్చారు. మా అమ్మకు ఆరోగ్యం బాగాలేదుట. హాస్పిటల్‌లో అడ్మిట్ చేశారట. నన్ను చూడాలనుకుంటోందట. నాన్నగారితో ఊరెళ్తున్నాను...'' చెబుతోంది స్వర్ణ.

తర్వాత మాటలేవీ మురారి చెవికెక్కలేదు. రాత్రికి భార్య ఇంటి దగ్గర ఉండదనే విషయం అర్థం కాగానే అతని మనసు గాలి తీసిన బెలూన్ అయిపోయింది. సంతోషం గాలిలోకెగిరిపోయింది.

నీరసంగా ఫోన్ పెట్టేశాడు.

స్టేషన్‌లో రైలు దిగేసరికి రాత్రి పదిగంటలయింది. అతని ఇల్లు స్టేషన్ దగ్గరలోనే వుంది.

తెల్లవార్లూ ఊపిరి పీల్చే వ్యవధి కూడా ఇవ్వకుండా స్వర్ణని ఉక్కిరిబిక్కిరి చేయాలని ఎన్ని కలలు కన్నాడు? ఈ రాత్రంతా ఒంటరిగా గడపాలి. విరహంతో కాగిపోవాలి. వృథాగా ఈ రాత్రి గడిచిపోతుంది.

తల్చుకుంటేనే అతని మనసంతా దిగులు, వేదన ఆవరించింది. మెల్లగా నడక సాగించాడు.

కొంతదూరం వెళ్లాక రోడ్డుకి కుడివైపున సందు మొదట్లో నిల్చున్న ఓ ఆకారం అతని కంట పడింది.

ఆ ఆకారం ఓ అమ్మాయిగా గుర్తించడానికి అట్టే సమయం పట్టలేదు.

ఒంటరిగా సందు మొదట్లో నిల్చుని వుందంటే ఆ టైపు కాదుకదా!

అతని ఆలోచన ఓ కొలిక్కి రాకముందే ఒక్క పరుగుతో అతని దగ్గరకొచ్చి ''నమస్తే సార్!'' అంది.

తదేకంగా ఆమెవైపు చూశాడు.

వయస్సు పదహారు, ఇరవై మధ్య వుంటుంది. ఎన్నో రాత్రులు శ్రమించి ఓ గొప్ప శిల్పి చెక్కిన సజీవ శిల్పంలా వుంది. ట్యూబ్ లైట్ కాంతిలో ఆమె పచ్చని నడుము కాంతి పుంజంలా మెరుస్తోంది. కన్ను త్రిప్పుకోను సాధ్యంకాని విలక్షణమైన అందం.

డాక్టర్ మురారికి ఆమెను ఎక్కడో చూసినట్లనిపించింది. గుర్తు తెచ్చుకునే అతని ప్రయత్నాన్ని భంగపరుస్తూ-

''సార్! అమ్మకు సీరియస్‌గా వుంది. ఇప్పటికిప్పుడు నొప్పి ఎక్కువయింది. మీ దగ్గరకు తీసుకురావడం కోసం ఆటోను వెదుకుతూ వచ్చాను. మీరే ఎదురొచ్చారు'' అంది కంగారుగా.

> **అమ్మకు మందులు కొనడానికి కూడా నా దగ్గర డబ్బు లేదు. అమ్మ లేకుండా నేను బ్రతకలేను సార్. నాకున్న ఒకే ఒక దిక్కు అమ్మ. ఎలాగైనా అమ్మను కాపాడండి. రెక్కాడి తేకానీ డొక్కాడని జీవితం. మీ రుణం వుంచుకోను సార్. డబ్బుల్లేకనే హాస్పిటల్‌వైపు రాలేదు. నాలుగు రోజులుగా ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చాను.**

ఆమె ముఖంలో ఆందోళన, తొట్రుపాటు ప్రతిబింబిస్తున్నాయి.

అప్పుడు గుర్తొచ్చిందతనికి. ఆమెను ఎప్పుడు చూశాడో? పదిరోజుల క్రితం కడుపునొప్పితో బాధపడుతున్న తల్లిని తీసుకుని హాస్పిటల్‌కొచ్చిందామె. ఆమెను పరీక్షించి అపెండిసైటిస్ ఆపరేషన్ చేయాలని చెప్పాడు తను.

ఎంత ఖర్చవుతుందో అడిగి తెలుసుకున్నారు. మళ్లీ వస్తామని, తాత్కాలికంగా మందులు రాయించుకుని వెళ్లిపోయారు. తర్వాత రాలేదు.

''ఆపరేషన్ చేయాలని చెప్పాకదా! మీ అమ్మను తీసుకుని మళ్లీ వస్తానని వెళ్లిపోయారు? ఎందుకు రాలేదు?'' ఆమె వెంట సందులోకి నడుస్తూ అన్నాడు.

ఆమె నుండి సమాధానం లేకపోవడంతో మరేమీ మాట్లాడలేదతను.

ఓ పదడుగులు నడిచేసరికి సందు మొదట్లోని ట్యూబ్ లైటు కాంతి పలుచనైపోయింది. మసక చీకటి ఆవరించింది.

కుక్కలు ఆ చీకట్లో అక్కడక్కడా ముసగదీసుకు పడుకుని ఉన్నాయి. వాతావరణం నిశ్శబ్దంగా వుంది. చల్లగాలి సుతారంగా వీస్తోంది.

కొంతదూరం వెళ్లాక ఓ పెంకుటింట్లోకి దారి తీసిందామె. ఆమె వెంటే నడిచాడతను.

రెండు గదుల ఇల్లు.

ముందు గదిలో మంచంలో పడుకుని బాధగా మూలుగుతోంది ముసలావిడ. ఇంట్లో ఎవరూ వున్న అలికిడిలేదు.

సూట్‌కేసు ఓపెన్‌చేసి మెడికల్ కిట్ తీసాడతను.

ఓ మేగజైన్‌లోని ఓ ఆర్టికల్ ఇన్స్పిరేషన్ వలన అతను ఎక్కడికెళ్లినా వెంటనే మెడికల్ కిట్ తీసుకుకెళ్లడానికి అలవాటుపడ్డాడు. ఆ అలవాటు ఎన్నోసార్లు సంతృప్తినిచ్చింది.

ఆమెను పరీక్షించి రెండు ఇంజెక్షన్స్ ఇచ్చాడు. కొద్దిసేపటి తర్వాత ఆవిడ మూలుగు ఆగిపోయింది. నిద్రలోకి జారుకుంది.

మెడికల్ కిట్ సూట్‌కేసులో సర్ది తలెత్తి ఆమెవైపు చూసాడు.

ఆమె చేపకళ్లతో ఆందోళనగా చూస్తోంది.

''మీ పేరు?'' అడిగాడు డాక్టర్ మురారి.

''సంధ్య సార్' చెప్పిందామె.

''సంధ్యా! నొప్పి తగ్గడానికి, నిద్ర పట్టడానికి ఇంజెక్షన్స్ చేశాను. తెల్లారేదాకా మెలుకువ రాదు. ఉదయం పరకడుపుతో హాస్పిటల్‌కు తీసుకురండి'' చెప్పాడు.

తలెత్తి బేలగా చూసిందామె. ఆమె పెదవులు వణుకుతున్నాయి.

''ఆపరేషన్‌కు నావద్ద డబ్బులేదు. దయచేసి మా అమ్మను కాపాడండి సార్'' తడబడుతూ అంది.

ఆమె పరిస్థితి అతనికర్థమయింది.

''మీరు నా ఫీజు ఇవ్వాల్సిన అవసరంలేదు. హాస్పటల్‌లో రూం చార్జీ కూడా వద్దు. అవసరమైన మందులు తెచ్చుకుంటే చాలు'' చెప్పాడు.

ఆమె నుండి సమాధానంలేదు. నేలచూపులు చూస్తూం

డిపోయింది.

నిముషం తర్వాత తలెత్తి చూసింది. ఆ కళ్ళల్లో ఏదో బాధ అవ్యక్తంగా, ఏదో అలజడి అస్థిమితంగా.

''ఇలా రండి సార్'' అంటూ లోపలి గదిలోకి నడిచింది. ఆమె వెంట నడిచాడతను.

లోనికెళ్లాక అడిగిందామె- ''నేను అందంగా వుంటానా సార్?''

ఊహించని ఆ ప్రశ్నకు తడబడ్డాడు.

క్షణం తర్వాత ''చాలా అందంగా వున్నావు'' అన్నాడు.

''అమ్మకు మందులు కొనడానికి కూడా నా దగ్గర డబ్బు లేదు. అమ్మ లేకుండా నేను బ్రతకలేను సార్. నాకున్న ఒకే ఒక దిక్కు అమ్మ. ఎలాగైనా అమ్మను కాపాడండి. రెక్కాడితేకానీ డొక్కాడని జీవితం. మీ రుణం వుంచుకోను సార్. డబ్బుల్లేకనే హాస్పిటల్ వైపు రాలేదు. నాలుగు రోజులుగా ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చాను. వయసుకుతగ్గ అందం, దానికి తగ్గ అవయవ సౌష్టవం తప్ప మీకివ్వడానికి నా దగ్గరేమీ లేదు. నా శరీరాన్ని మీకర్పించాలనుకున్నాను. ఇలా మాట్లాడుతున్నానని బరితెగించినదాన్ననుకోకండి. మగ స్పర్శ ఎరుగని దాన్ని. బజారు మనిషిలా బ్రతకాలనుకుని వుంటే ఈ స్థితిలో ఈ రోజు ఇలా ఒట్టి చేతులతో మీ ముందు నిలబడేదాన్నికాను. ఈ ఒక్క రాత్రీ నన్ను మీ ఇష్టమొచ్చినట్టు చేసుకోండి. అమ్మను బ్రతికించండి సార్'' వేడికోలు, ఉద్వేగం, ఆవేదన కలిసిన గొంతుతో అంది.



అప్పుడక్కడ గాలి స్తంభించిపోయింది.

చెట్లు, పరిసరాలు నిశ్చలత్వాన్ని ఆపాదించుకున్నాయి.

అతని సమాధానం కోసం ఊపిరి బిగబట్టిందామె.

నిముషం తర్వాత అతని పెదవులు నిశ్శబ్దాన్ని చీల్చుతూ కదిలాయి.

''మిస్ సంధ్యా! పద్దెనిమిదేళ్ళ పడుచుదనాన్ని భద్రంగా దాచి భర్తకందించాలని కలలుకనే నీవు ఈ నిర్ణయం తీసుకోవడం వెనుక ఎంత వ్యధ చెందావో నీ ముఖం, మాటలే చెబుతున్నాయి. నీ పరిస్థితులతో ఆడుకునే కసాయివాడ్ని కానమ్మా! నేనూ మనసున్న మనిషినే. అమ్మను తీసుకుని వచ్చేయ్. అన్ని ఖర్చులూ నేనే భరించి ఆపరేషన్ చేస్తా. నీకేదో జీవనోపాధి చూపిస్తాను. నా జీవితానికి ఇంతకంటే సార్ధకత ఏముంటుంది? పవిత్రమైన శీలాన్ని ఆయుధంగా పెట్టే పరిస్థితి నీకెప్పుడూ రానివ్వను.''

డాక్టర్‌వైపు విస్మయంగా చూసిందామె.

స్వప్నమో, వాస్తవమో అర్ధంకాని అయోమయ స్థితి.

ఆమె కళ్లల్లో కన్నీరు ఉప్పొంగి జలజలా జారి చెక్కిళ్ళను తడిపేస్తుండగా రెండు చేతులూ జోడించి నమస్కరించింది.

చిరునవ్వుతో, నిష్కల్మష హృదయంతో సిద్దార్థుడిలా బయటకు నడిచాడు డాక్టర్ మురారి.

☆

**డి.కె.చదువులబాబు**